క్లుప్తంగా

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వైద్య సిబ్బంది

చౌడేపల్లె: లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యానే రమని డాక్టర్ పవన్‌కుమార్ తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వాస్పత్రిలో కరపత్రాలను ఆవిష్కరించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన, చేసుకున్న, ప్రోత్సహించిన వారు శిక్షార్హులని తెలిపారు. సూపర్‌వైజర్ జమున, సిబ్బంది సునీత, జయమ్మ పాల్గొన్నారు.

రైతులను ఆదుకుంటాం



మాట్లాడుతున్న ఏఓ హరిప్రసాద్

పులిచెర్ల(కల్లూరు): రైతు సంఘాల ద్వారా ప్రతి రైతును ఆదుకుంటామని మండల వ్యవసాయ శాఖాధికారి హరిప్రసాద్ తెలిపారు. మంగళంపేటలో కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో గురువారం రైతు ఉత్పత్తిదారుల సంఘ సమావేశం నిర్వహించారు. వెటర్నరీ ఆఫీసర్ తబ్రిజ్, వాటర్‌షెడ్ చైర్మన్ ప్రభాకర్, రైతు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మునిరత్నం, కార్యదర్శి ముర్వత్‌బాషా, సర్పంచ్‌లు మధు, వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

మైనారిటీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

పలమనేరు: మైనారిటీ కార్పొరేషన్ రుణాలకు ఆసక్తిగలవారు సంబంధిత సచివాలయాల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని ముస్లిం, క్రిస్టియన్, బుద్ధులు, సిక్కులు, జైనులు, పార్శీలు ఇందుకు అర్హులని పేర్కొన్నారు. కులధ్రువీకరణ, ఆధార్, పాస్‌పోర్ట్, రేషన్‌కార్డు, బర్త్ సర్టిఫికెట్, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్ కాపీలు, ఫొటోలు సచివాలయ సిబ్బందికి అందజేయాలని సూచించారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

గంగవరం: మండలంలోని చౌడిరెడ్డిపల్లి వద్ద పేకాట ఆడుతున్న నలుగురిని గురువారం పోలీసులు అరెస్ట్ చేసినట్లు సీఐ ప్రసాద్ తెలిపారు. గ్రామ సమీపంలో పేకాటాడుతున్నట్టు సమాచారం రావడంతో పోలీసులు గ్రామంలో పేకాట స్థావరంపై దాడి చేశారు. దాడిలో పేకాటాడుతున్న నలుగురిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.20వేలు స్వాధీనం చేసుకున్నారు.

శిక్షణ తరగతులకు స్పందన

చిత్తూరు కార్పొరేషన్: జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులకు విశేష స్పందన లభిస్తున్నట్టు ఉప గ్రంథాలయ అధికారి లలిత చెప్పారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులకు విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరవుతున్నారన్నారు. కథలు చెప్పడం, పుస్తక సమీక్ష, యోగా, స్పోకెన్ ఇంగ్లిష్, హ్యాండ్ రైటింగ్ ఇంప్రూవ్‌మెంట్, డ్రాయింగ్‌పై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఆదివారం నుంచి అబాకస్ శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముడుపుల బట్టీలు

- ఇష్టారాజ్యంగా ఇటుక బట్టీలు
- యథేచ్ఛగా కలప తరలింపు
- అక్రమంగా చెరువుల నుంచి మట్టి తరలింపు
- అటవీ, రెవెన్యూ సిబ్బందికి కాసుల వర్షం



ఇటుక బట్టీల వద్ద నిల్వ ఉన్న కలప

చౌడేపల్లె: అక్రమ ఇటుకల బట్టీల వ్యాపారం అధికారులకు కాసుల వర్షం కురిపిస్తోంది. వారి వ్యాపారానికి అటవీ, రెవెన్యూ, ఇరిగేషన్, ట్రాన్స్‌కో అధికారులు సహకరిస్తుండడంతో ఇటుకల దందా మూడు పువ్వులు ఆరు కాయల చందంగా సాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా పచ్చని చెట్లను నరికివేస్తూ, అటవీ ప్రాంతాల్లోని కలపతోపాటు చెరువుల్లోని మట్టిని ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. అధికారులు వారిచ్చే మామూళ్లు తీసుకుని వారి అక్రమ వ్యాపారానికి తమ వంతు సహకారం అందిస్తున్నారు. పర్యావరణాన్ని నాశనం చేస్తున్నా అధికారులు ఓల్టా చట్టాన్ని నీరు గారుస్తున్నారు. ఇటుక బట్టీల నిర్వహణకు చెరువుల్లోని బంకమట్టిని, కలప చెట్ల నరికి వేతకు ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే వారి వ్యాపారం రూ.లక్షల్లో సాగుతోంది.

చౌడేపల్లె మండలంలోని పుదిపట్ల పంచాయతీ మిట్టూరులో 20కుపైగా, చిన్నకొండామర్రి, పాలెంపల్లె, కాటిపేరి ప్రాంతాల్లో ఇటుకల బట్టీలు ఉన్నాయి. ఇక్కడకు బిహార్, ఒడిశా నుంచి కూలీలు వచ్చి పనులు చేస్తున్నారు. రోజూ రూ.లక్షల్లో వ్యాపారం సాగుతోంది. వెయ్యి ఇటుకలను రూ.7,200 నుంచి రూ.7,500 వరకు దూరాన్ని బట్టి ఆర్డర్ల మేరకు వారే ట్రాక్టర్ల సాయంతో విక్రయిస్తున్నారు. వర్షం వచ్చినా వారి వ్యాపారానికి అడ్డుకలగకుండా పెద్ద షెడ్లు సైతం ఏర్పాటుచేసుకున్నారు. వాటిలో ఇటుకలను భద్రపరచడం తరువాత గూడులా ఏర్పాటు చేసుకుని శూలలో ఇటుకలను పేర్చి కలప, వరి, చెక్క పొట్టుతో కాల్చిన ఇటుకలను విక్రయిస్తారు.

రూ.15వేలు కట్టాల్సిందే..

బట్టీల యజమాని ఇటుకల గూడు పేర్చిన వెంటనే అటవీ శాఖ అధికారులకు చలానా పేరిట రూ.15 వేల నుంచి రూ.20 వేలు ఇవ్వాల్సి ఉంది. అంత పెద్ద మొత్తంలో నగదు ఎందుకు చెల్లించాలని ఎవరైనా ప్రశ్నిస్తే చలానా చెల్లించాలని టన్ను కలప చెట్లు నరికి వేసినందుకు రూ.18 వేలు చలానా చెల్లించాలని భయపెడుతుండడంతో అధికారులు చెప్పిన మేరకు చెల్లిస్తున్నట్లు ఇటుకల బట్టీ నిర్వాహకులు ఒకరు తెలిపారు. అయినా ఇప్పటి వరకు ఒక్కరికి కూడా రశీదులు సైతం ఇవ్వలేదని పేర్కొన్నారు. ఇటీవల కాలంలో లెక్కల విషయంలో తేడా రావడంతో పుదిపట్ల పంచాయతీకు చెందిన ఓ నేత అంతా తానే చూసుకుంటామని భరోసా ఇస్తూ వసూళ్ల పర్వం ప్రారంభించారని సమాచారం.

ప్రతి బట్టీ వద్ద 10 లోడ్ల కట్టె..

మిట్టూరు, చిన్నకొండామర్రి, పాలెంపల్లె వద్ద గల ఇటుక బట్టీల వద్ద కనీసం 10 లోడ్ల కట్టె ఉంటుంది. ఈమేరకు కొన్ని వందల చెట్లను నరికి వేస్తున్నా అటవీ, రెవెన్యూ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదు. ప్రభుత్వమేమో చెట్లను పెంచి పర్యావరణాన్ని రక్షించాలని ప్రచారం చేస్తున్నా ఉన్న చెట్లను అధికారులు రక్షించలేకపోతున్నారు అనడానికి నిదర్శం ఇది. ఇకనైనా జిల్లా కలెక్టర్ స్పందించి భూగర్భ జలాలను సంరక్షించడంతోపాటు చెట్లు నరికివేతకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

ఎఫ్‌ఆర్వో ఏమన్నారంటే..

కలప ఇటుకల బట్టీలకు అక్రమ రవాణా విషయమై పుంగనూరు ఎఫ్‌ఆర్వో శ్రీరాములను వివరణకోరగా తమ దృష్టికి రాలేదని, తామెవ్వరికీ ఎలాంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. మరి ఇంత మొత్తంలో కలప బట్టీల వద్ద ఉందని, చలానా పేరిట నగదు వసూలుపై ప్రశ్నించగా విచారణ చేసి చర్యలు తీసుకొంటామని బదులిచ్చారు. ఇప్పుడు జరుగుతున్న అక్రమ వ్యాపారంపై ప్రశ్నించగా మాట దాటవేశారు.



యథేచ్ఛగా మట్టి రవాణా..

మిట్టూరు సమీపంలోని చెరువుల్లో మట్టిని ఇష్టానుసారంగా హిటాచీల సాయంతో తవ్వి టిప్పర్ల ద్వారా ఇటుక బట్టీల వద్దకు తరలించి నిల్వచేస్తున్నారు. కూటమి నేతల అండదండలతో వారి కనుసన్నల్లో మట్టి వ్యాపారం సాగుతోంది. చెరువుల్లో నిబంధలకు విరుద్ధంగా మట్టిని తరలిస్తున్నా రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు నోరుమెదడంలేదు. వారికి నెలనెలా ఇటుక బట్టీల నుంచి ముడుపులు అందుతాయని పలువురు ఆరోపిస్తున్నారు.




ఇటుకల బట్టీల వద్ద నిల్వ ఉన్న మట్టి

ఓల్టా చట్టాన్ని పరిరక్షిస్తాం..

ఓల్టా చట్టాన్ని పరిరక్షిస్తాం. నిబంధనలకు విరుద్ధంగా ఇటుక బట్టీలకు మట్టిని తరలించినా, చెట్లను నరికివేసే వారిపై ఓల్టా యాక్ట్ ఉల్లంఘన మేరకు చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

–తహసీల్దార్ హనుమంతునాయక్

గెరిగ కుండ ప్రతిష్ఠ



అలంకరణలో అమ్మవారు

పలమనేరు: పట్టణంలోని తిరుపతి గంగమ్మ జాతరలో భాగంగా గంగ చాటు కార్యక్రమం బుధవారం అర్ధ రాత్రి నుంచి మొదలై గురువారం ఉదయం దాకా జరిగింది. స్థానిక గుండుబావి వద్ద గంగరాతికి ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి గెరిగ కుండను గంగమ్మ ఆలయానికి తీసుకొచ్చి ప్రతిష్ఠించారు. అనంతరం గంగమ్మ ఆలయం వద్ద అభిషేకం చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని వీధుల్లో బలిహరణం చేస్తూ జాతర చాటింపు చేశారు. చాటింపులో భారీగా భక్తులు పాల్గొన్నారు. గురువారం ఆలయం వద్ద శాలివాహన, కుమ్మర సంఘ ఆధ్వర్యంలో అమ్మవారికి సారెను పెట్టి పూజలు చేశారు. ఈసందర్భంగా అన్నదానం చేశారు.



ఊరేగింపుగా తీసుకొస్తున్న గెరిగ

డబ్బులు అడిగితే చర్యలు

గుడుపల్లె: పింఛన్లదారుల నుంచి ప్రతినెలా ఇచ్చే పింఛన్ నుంచి ఎవరైనా డబ్బులు అడిగితే చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ రాధాక్రిష్ణ హెచ్చరించారు. గురువారం మండలంలోని పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. ప్రభుత్వ ఉద్యోగులు, ప్రయివేటు వ్యక్తులు ఎవరైనా పింఛన్‌దారుల నుంచి డబ్బులు వసూలు చేస్తే కేసులు నమోదు చేస్తామని ఈసందర్భంగా ఆటోలో ప్రచారం చేయిస్తున్నారు.

నేటి నుంచి మృత్యుంజయేశ్వరుని బ్రహ్మోత్సవాలు



ఆలయ ముఖచిత్రం

చౌడేపల్లె: స్థానిక బజారు వీధిలోని శ్రీఅభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి ఆలయంలో నేటి నుంచి మే 14వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ కమలాకర్ తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఒక్కొక్కరోజు ఒక్కొక్క అలంకారంలో శివపార్వతులను కొలువుదీర్చి గ్రామంలోని పురవీధుల్లో ఊరేగించనున్నట్లు పేర్కొన్నారు. నేడు అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. ఈమేరకు ఆలయంలో బ్రహ్మోత్సవాలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.



బుస్స్‌స్స్‌స్స్.. సయ్యాట..!

మండుతున్న ఎండలు ప్రజలను చిర్రెత్తిస్తున్నాయి. అయితే ఎండ తీవ్రతను పట్టించుకోని ఓ పాముల జంట తమ సయ్యాటతో మైమరిచిపోయాయి. గురువారం మండలంలోని వెంగళపల్లె పంచాయతీ పాలెంపల్లె వద్ద రెండు పాములు ఓ కానుగచెట్టు కింద బుసలు కొడుతూ, ఒకదానిపై ఒకటి పెనవేసుకుంటూ మెలిదిరుగుతూ, నిలువునా లేస్తూ పడుతూ ..ఇలా కేళీవిలాసంలో మైమరిచాయి. ఇది ఆ ప్రాంతంలోని కూలీలు, రైతులకు కంటబడింది. ఒకింత భయపడుతూనే దూరం నుంచి వాటి సయ్యాటను ఆసక్తిగా వీక్షించారు. –చౌడేపల్లె

95శాతం పింఛన్ల పంపిణీ

పలమనేరు: పలమనేరు మున్సిపాలిటీలో సామాజిక పింఛన్ల పంపిణీ 95 శాతం జరిగిందని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి గురువారం తెలిపారు. మే నెలకు సంబంధించి మొత్తం పింఛన్లు 4,514 కాగా 4,312 అందజేసినట్టు పేర్కొన్నారు.

భక్తిప్రపత్తులతో కలశ పూజ



బంగారుపాళెం: మండలంలోని మొగిలి శివాలయ అనుబంధ ఆలయమైన దేవర కొండపై గురువారం కలశ పూజ భక్తిప్రపత్తులతో నిర్వహించారు. పార్వతీ సమేత శ్రీజలకంఠేశ్వరస్వామి దేవస్థానం జీర్ణోద్ధరణ, నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా అర్చకులు ఉదయం గణపతిపూజ, స్వస్తివాచనం, రక్షాబంధన, కలశారాధన, అభిషేకం, శాంతి, సర్వదేవత, రుద్రహోమాలు, సాయంత్రం గోపూజ, అంకురార్పణ ఇత్యాది వాటిని శాస్త్రోక్తంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం విగ్రహ ప్రతిష్ఠాపన చేయనున్నట్టు చెప్పారు.

వైఎస్సార్‌సీపీ నేత మృతి



నివాళులర్పిస్తున్న బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి

బైరెడ్డిపల్లె: మండలంలోని గంగినాయనపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత లక్ష్మప్ప గురువారం అనారోగ్యంతో మృతిచెందాడు. పార్టీ ఆవిర్భావం నుంచి లక్ష్మప్ప పార్టీ అభివృద్ధికి కృషి చేశాడని, ఆయన మృతి పార్టీకి తీరనిలోటని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి అన్నారు. ఆయన భౌతికకాయం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో సర్పంచులు రేణుకమ్మ, వెంకటేష్, రాజప్ప, బాలక్రిష్ణగౌడు ఉన్నారు.

ఆదర్శ ప్రవేశ ఫలితాల్లో ప్రతిభ

రొంపిచెర్ల: రొంపిచెర్ల ఆదర్శ పాఠశాలలో ఆరవ తరగతి ప్రవేశ పరీక్షల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపల్ సరళ అన్నారు. ఆమె గురువారం విలేకరులతో మాట్లాడారు. పాఠశాలలో ప్రవేశాలకు 99 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, 82 మంది పరీక్షలు రాయగా 75 మంది అర్హత సాధించారని తెలిపారు. 100 మార్కులకుగాను పుంగనూరుకు చెందిన విద్యార్థి చితా నాందిత్యారెడ్డి 82 మార్కులు, పవన్‌శ్రీ 76 మార్కులు, హర్షిద్‌బాషా 75 మార్కులు, కేతన్ కుమార్‌రెడ్డి 74 మార్కులు, భరత్‌సాయి, సోమశేఖర్ 70 మార్కులు సాధించారని పేర్కొన్నారు. ఓసీ, బీసీలకు 35 మార్కులు, ఎస్సీ, ఎస్టీలకు 25 మార్కులు కటాఫ్ నిర్ణయించినట్లు తెలిపారు.

ప్రభుత్వ భూమిలో వెంచర్‌పై చర్యలు



ప్రభుత్వ భూమిలో తొలగించిన రాళ్లు

పలమనేరు: కొంత సెటిల్‌మెంట్ భూమిని కొనుగోలు చేసి దాని పక్కనున్న ప్రభుత్వ భూమిని ఆక్రమించి వెంచర్ వేసి ప్లాట్లు చేసి పట్టా నంబరును చూపి స్థలాలను రిజిస్టర్ చేయడం పలమనేరు ప్రాంతంలో కొందరు రియల్టర్లకు పరిపాటిగా మారింది. ఇలాంటి ఘటనే టి.వడ్డూరులో గురువారం వెలుగుచూసింది. ఇటీవల పలమనేరులో కలెక్టర్ గ్రీవెన్స్‌డే నిర్వహించగా ఆ గ్రామానికి చెందినవారు ఇచ్చిన ఫిర్యాదుతో స్థానిక రెవెన్యూ అధికారులు దీనిపై విచారించారు. బేరుపల్లికి చెందిన రెడ్డెప్పరెడ్డి అనే రైతు పట్టాభూమిని గ్రామానికి చెందిన కొందరు కొనుగోలుచేశారు. ఆభూమికి ఆనుకొని కొంత ప్రభుత్వ, కొంత గట్టు పోరంబోకు భూములు ఉన్నాయి. ఇది తెలిసి కొనుగోలుదారులు పట్టాభూమిలోకి ప్రభుత్వ భూమిని కలుపుకొని తాజాగా వెంచర్ వేసి ప్లాట్లు వేసి స్థలాలను సిద్ధం చేశారు. కలెక్టర్ ఆదేశాలతో సర్వే చేసిన స్థానిక రెవెన్యూ అధికారులు, ఆక్రమించుకున్న ప్రభుత్వ స్థలంలోని సైట్ల కోసం నాటిన రాళ్లను తొలగించారు. అయితే విచారణకు వచ్చిన అధికారులు వివరాలు బయటపెట్టకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇప్పటికైనా అధికారులు భూమిని స్వాధీనం చేసుకొని హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. వెంచర్‌కు పంచాయతీ అనుమతి కూడా లేదని సర్పంచ్ మునస్వామి చెప్పడం గమనార్హం.

ఎట్టకేలకు సమాచారం

సాక్షి ఎఫెక్ట్..

చౌడేపల్లె: ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేయాల్సిన పౌర సమాచార హక్కు చట్టం వివరాలను కోరేందుకు ఏర్పాటు చేసిన బోర్డుల్లో ఎట్టకేలకు తహసీల్దార్ హనుమంతునాయక్ గురువారం సమాచారం ఏర్పాటుచేశారు. సాక్షిలో 'మారని సమాచారం' శీర్షికన అధికారులు మారినా పేర్లు మార్చలేదంటూ కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు మారిన అధికారుల వివరాల ప్రదేశంలో నామమాత్రంగా పేపర్లను అతికించి వివరాలు సమోదుచేశామంటూ మమ అనిపించారు.



బోర్డుపై అతికించిన పేపర్లు

ఎర్రజెండా రెపరెపలు



పలమనేరు: మాట్లాడుతున్న జడ్జి లిఖిత

- వాడవాడలా ఘనంగా మే డే వేడుకలు



చౌడేపల్లెలో కార్మికుల ర్యాలీ

పలమనేరు: ప్రపంచ కార్మిక వర్గ దీక్షా దినం మేడే అని కార్మికులకు సైతం ప్రత్యేక చట్టాలున్నాయని వాటిపై అవగాహన కలిగిఉండాలని పలమనేరు జూనియర్ సివిల్ జడ్జి లిఖిత పేర్కొన్నారు. పట్టణంలో 139వ మే డే వేడుకలను గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులతో కలిసి ఆమె వేడుకల్లో పాల్గొన్నారు. న్యాయవాద సంఘ అధ్యక్షుడు భాస్కర్, కమిషనర్ రమణారెడ్డి పాల్గొన్నారు. స్థానిక ఏరియా ఆస్పత్రి వద్ద ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగింది. స్థానిక ఆర్టీసీ డిపో వద్ద ఎంప్లాయీస్ యూనియన్, బస్టాండ్ వద్ద ఏఐటీయూసీ, అంగన్‌వాడీ వర్కర్స్ మేడేను నిర్వహించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద జరిగిన వేడుకల్లో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గిరిధర్‌గుప్తా, సీఐటీయూ అధ్యక్షురాలు సావిత్రి పాల్గొన్నారు. ఇక గ్రంథాలయం వద్ద ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు, మిడ్ డే మీల్స్ నిర్వాహకులు జెండా ఆవిష్కరించారు. యోగేష్‌బాబు, వీఆర్ జ్యోతి, ఉమాపతినాయుడు, పెన్షనర్ల సంఘనేత గురురాజారావు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: స్థానిక చెక్‌పోస్టు కూడలి వద్ద కార్మిక వర్గ జెండాను ఎగురవేశారు. అనంతరం బైరెడ్డిపల్లె పోలీస్‌స్టేషన్ నుంచి ర్యాలీ నిర్వహించారు. ఐఎస్టీయూ రాష్ట్ర నాయకురాలు జి.భారతి, అంగన్‌వాడీ రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకటరత్న, శకుంతల, సరోజ, తిప్పక్క, నిర్మల, ఉమాదేవి, వసంత, దీప పాల్గొన్నారు.

వి.కోటలో..

వి.కోట: మండల హమాలీల ఆధ్వర్యంలో మేడే ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ సర్కిల్ నుంచి వైఎస్సార్ సర్కిల్ వరకు ర్యాలీ చేశారు. హమాలీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు చైతన్య, యూనియన్ జిల్లా కార్యదర్శి తంగరాజ్, వి.కోట కార్యదర్శి అరుణ్ సభ్యులు దాము, స్వామినాథన్, భాస్కర్ పాల్గొన్నారు.

పుంగనూరులో..

పుంగనూరు: సీపీఐ, సీపీఎం, సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏపీఎస్‌ఆర్టీసీ, ఆటో యూనియన్‌ల ఆధ్వర్యంలో ఘనంగా మే డేను నిర్వహించారు. ఎర్రజెండాలు పట్టుకుని ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ సర్కిల్‌లో ప్రదర్శన చేశారు. సీఐటీయూ కార్యదర్శి ఎల్కూరి మురళి, రాష్ట్ర దళిత సంక్షేమ సమితి అధ్యక్షుడు శంకరప్ప, ఆర్టీసీ సంఘ నేతలు వెంకట్రమణారెడ్డి, రామమూర్తి, మున్నా, నాగరాజు పాల్గొన్నారు.

కుప్పంలో..

కుప్పం: పట్టణంలోని వివిధ కార్మిక సంఘాలు కలిసి కార్మిక భవన్ నుంచి భారీ ఎత్తున పలక వాయిద్యాలు, బాణసంచా పేలుస్తూ బస్టాండు వరకు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా కడా పీడీ వికాస్ మర్మత్ ర్యాలీలో పాల్గొన్నారు. ఆర్టీసీ వైస్ చైర్మన్ పి.ఎస్.మునిరత్నం పాల్గొన్నారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: స్థానిక బస్టాండులో ఎర్రజెండాను ఎగురవేశారు. జర్నలిస్టులు, కార్మికులు కలిసి డప్పు కళాకారుల బృందంతో కార్మికుల జెండా చేతబట్టి పురవీధుల్లో ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి డాక్టర్ చంద్ర, కేవీపీఎస్ మండలాధ్యక్షుడు వాసు, బ్యాంకు ఉద్యోగుల సంఘ రాష్ట్ర కార్యదర్శి బ్యాంకు రెడ్డప్ప, కార్మిక సంఘ నేతలు రామకృష్ణ, వరదం గోవిందయ్య, కార్మికులు పాల్గొన్నారు.



కుప్పం ర్యాలీ

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి కార్మిక నేతలు, కార్మికులు నివాళులర్పించారు. మండల మాల మహానాడు అధ్యక్షుడు మంజునాథ్, ఆటో యూనియన్ నేతలు తిప్పయ్య, కదిర్, అమరనారాయణ, శివన్న, రంగప్ప, ఎల్లప్ప పాల్గొన్నారు.



పుంగనూరులో ప్రదర్శన



పెద్దపంజాణిలో అంబేద్కర్‌కు నివాళి



వి.కోటలో హమాలీల ర్యాలీ



బైరెడ్డిపల్లెలో ర్యాలీ



పలమనేరు ఆర్టీసీ డిపో వద్ద ఉద్యోగులు

పలమనేరు విద్యార్థిని ప్రతిభ



పవిత్రను అభినందిస్తున్న అధ్యాపకులు

పలమనేరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ, ఎస్వీయూలో ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ చేసిన పట్టణానికి చెందిన పి.పవిత్ర అనే విద్యార్థిని ఇటీవల జరిగిన యూజీసీ–సీఎస్ఐఆర్ పరీక్షలో 117 ర్యాంకు పొంది జేఆర్ఎఫ్(జూనియర్ రీసెర్చ్ ఫెలో) సాధించిందని కళాశాల ప్రిన్సిపల్ డా.ఎం.వెంకటేశులు గురువారం తెలిపారు. ఈసందర్భంగా స్థానిక కళాశాలలో ఆ విద్యార్థినిని ప్రిన్సిపల్, అధ్యాపకబృందం అభినందించింది. జేఆర్ఎఫ్ పీహెచ్‌డీలో నెలకు స్టైఫండ్‌గా రూ.42వేలు విద్యార్థినికి అందుతుందని ఆయన తెలిపారు.